# చికటి తెరలు

ప్రసాదరావు మస్తిష్కం ఆలోచనలతో నిండి, ఆ వేదన అధికమవటంతో పని చేయటం లేదు. రెండు చేతులతో తలపట్టుకుని ఆలోచనా ముద్రలో వుండి పోయాడు. తన జీవితమంతా విస్సారంగా వుండటానికి తనేం తప్పు చేశాడని? ఆలోచిస్తున్న కొద్దీ మనసు మరింత వికలమై పోతోంది ...కాని ఆలోచించక తప్పదు.

తనకి జ్ఞానమొచ్చిందగ్గర్నుండి కష్టాలే యెదుర్కొంటున్నాడు...ఎందుకు? పద్దెనిమిదేళ్లు రావటంతోనే తండ్రి మరణించాడు. చదువుకి స్వస్తి చెప్పక తప్పింది కాదు ...వుద్యోగాన్వేషణ ఓ సమస్య అయింది ....కాళ్లరిగిపోయేలా తిరిగితే యేదో గుమాస్తా వుద్యోగం దొరికింది. తనూ ఓ వుద్యోగస్తుడయినందుకు అమ్మ యెంతగానో ఆనందించింది...తనని ఓ యింటి వాణ్ణి చెయ్యాలని, కోడలు యింట్లో మసలుతూంటే చూచి ఆనందించాలని తల్లి అభిప్రాయం. ఒత్తిడి చేసింది. రాగల కష్టాల్ని అర్థం చేసుకున్నా, తల్లి కోరిక తీర్చటం, ఆమెని సంతోష పర్చటం తనవిధి అనిపించింది...సరేనన్నాడు. తల్లి యేరి, కోరి తెచ్చిన సుశీలనే వివాహం చేసుకున్నాడు. కాని—

ఏ సంకల్పంతో యే ఆశతో తల్లి తనకి పెళ్లి చేసిందో, ఆ ఆశ నెరవేఱలేదు...పెళ్లయిన నాలుగు నెలలకే తల్లి పరమపదించింది .. తనప్పుడు చిన్నపిల్లాడిలా యేడ్చాడు... ఎంతయేడ్చి యేం లాభం అని మనసు దిటవు చేసుకున్నాడు. సుశీల కాపరానికి వొచ్చింది గాని, ఎప్పుడూ అస్వస్థతగానే వుంటుంది.. అసలు తనకెందుకు వివాహం చేసిందమ్మ? వివాహం చేయకపోతే అమ్మ బ్రతికి వుండేదేమో! పిచ్చిగాని విధినెవరు తప్పించగలరు?.. మళ్లీ సమాధాన పడ్డాడు ప్రసాదరావు. యీ ఆలోచనల్లో పడి కాలగమనం కూడా తెలీకండా వుందతనికి. గోడగడియారం అయిదుగంటలు కొట్టడంతో ఆశ్చర్యంగా గడియారం వేపు చూశాడు. అప్పుడే అయిదు గంటలయిపోయింది అనుకుని బరువుగా లేచి నిల్చున్నాడు.

మెల్లగా, అతిమెల్లగా, రోడ్డు ప్రక్కని నడుస్తూ పోతున్నాడు ప్రసాదరావు. అతని ప్రక్కనుండి యెన్నో కార్లు, సైకిళ్లు, యెంతోమంది వ్యక్తులు పోతున్నారు. కాని అవన్నీ అతని దృష్టిపథంలో పడలేదు. ఇల్లు చేరుకునే సరికి సుశీల వంటగదిలో వుంది. ఆమెని చూడ్డంతో అతనిలో జాలి పెల్లుబికింది. విచారం పొర్లుకొస్తోంది. సుశీలని చూస్తుంటే అస్థిపంజరం చూసినట్టే వుంటుంది. ఎంతో కష్టంగా ఓర్లేక వండుతున్నదేమో...అనుకున్నాడు ప్రసాదరావు. అందుకే రెండుమూడుసార్లు ఆమెతో అన్నాడు, హోటలునుండి భోజనం తెచ్చుకుందామని...కాని సుశీల ఒప్పుకోలేదు. ఇద్దరికోసం వండటం యేమంతకష్టం...? అనేది చిన్నగా నవ్వుతూ...ఆమెకు ఆసక్తి వుండేగాని శక్తిలేదు...తనతల్లి బ్రతికుంటే సుశీలకి యింతకష్టం వుండకపోవును కదా...అనుకునేవాడు ప్రసాదరావు.

ఈ వేళకూడా మళ్ళీ అలాగే అనుకొన్నాడు. మెల్లగా వంటగది గుమ్మందగ్గరికి పోయాడు.

### ముద్దంశెట్టి హనుమంతరావు

"వంటయిపోయిందా సుశీలా?" అన్నాడు,

"సరి...అయిపోయినట్టేనండీ" నవ్వుతూ అంది సుశీల. ఆ నవ్వులో పుష్టి కన్పించలేదు.

"ఎన్నిసార్లు చెప్పినా, నువ్వు విన్పించుకోవు సుశీ! హోటలునుండి కేరియర్ తెచ్చుకుంటే యీ బాధే వుండేదికాదు...నీవు నీరసంగా వున్నప్పుడు గంటలతరబడి పొయ్యిదగ్గర కూచోవటం యేం బావుంది?"

సుశీల ఓసారి ముఖం చెంగుతో ఒత్తుకుని భర్తకి దగ్గరగా వస్తూ "హోటలు భోజనం తింటే రుచులు తెలుసుకునే జ్ఞానం కూడా పోతుందంటారండీ మా నాన్న...అయినా యిదీ ఒక కష్టమేనా తెద్దురూ...!" అంటూంటే ఆమెకి చిన్న దగ్గు తెరవచ్చింది.

"జలుబు చేసినట్టుంది సుశీలా! దానికితోడు దగ్గు ఒకటి...డాక్టర్ని తీసుకొచ్చి చూపించాలి..."

సుశీల భర్త మొహంలోకి అదోలా చూసింది.

"యీ పాటిదానికి డాక్టరెందుకండీ! అదే తగ్గిపోతుంది" అంది మెల్లగా.

ఎలాగన్నా డాక్టరుకి చూపించాలి సుశీ! నీ వంట్లో, యేమీ బలంలేనట్టుంది. మంచి మందులన్నా, టానిక్కులన్నా యిప్పించాలనుకుంటున్నాను..." అంటూంటే ప్రసాదరావు కళ్లు చెమ్మగిల్లినయ్. సుశీల యేదో చెప్పాలనుకుంది గాని ఆ చెప్పవల్సిందేదో పెదాలు దాటిరాలేదు.

"కాఫీ పెట్టమంటారా? మీ రెప్పుడొస్తారో తెలీక ముందు పెట్టివుంచలేదు"

నిజమే, తను రోజూ యింతకంటె ఆలస్యంగా వస్తుండేవాడు..."వద్దులే సుశీలా: నేను కాఫీ త్రాగే వస్తున్నా." అన్నాడు. సుశీల అమాయకంగా నిజమేననుకుని మళ్ళీ పొయ్యిదగ్గరికి వెళ్లిపోయింది.

ప్రసాదరావు అక్కడే నిల్చుని యేదో ఆలోచిస్తుంటే చప్పున డాక్టరు బాలకృష్ణ జ్ఞాపకమొచ్చాడు. బాలకృష్ణ ప్రసాదరావు బాల్యస్నేహితుడు ..ఇద్దరూ యిప్పటికీ అరమరలేకండా తిరుగుతారు. వారి మధ్య రహస్యాలంటూ యేమీదాగవు. వాడిదగ్గరికిపోతే మంచి మందులిస్తాడనుకున్నాడు ప్రసాదరావు. ఆలోచన తట్టడమూ, యింక ఆలస్యమూనా?

"సుశీలా?" లాలనగా పిల్చాడు.

"ఏమండీ?" అనుకుంటూ వచ్చింది సుశీల.

"వంట వేగిరం పూర్తి చెయ్యి. అలా వెళ్దాం...!!

"ఎక్కడికి?"

"నా స్నేహితుడొకడు కొత్తగా డాక్టరు ప్రాక్టీసు పెట్టుకున్నాడులే...నీ ఆరోగ్యంగురించి వాడికి చెప్తాను" అన్నాడు ప్రసాదరావు. సుశీల బెదరిన లేడిపిల్లలా చూసింది. కాని ప్రసాదరావు ఆమెమాత్రం గుర్తించలేదు.

"ఇప్పుడవ్వదులెండి—కావాలంటే రేపువెళ్దాం" అంది సుశీల...ఆమెకి వ్యతిరేకంగా ప్రవర్తించటం ప్రసాదరావుకి అలవాటులేదు.

## 2

సుశీలని బాలకృష్ణదగ్గరికి తీసికెళ్ళాడు. సుశీలకి వెళ్ళటం యిష్టంలేకపోయినా తప్పిందికాదు. రానంటే ఆయనేమనుకుంటాడోనని భయం. ఇప్పుడామెలో ఓ విధమైన అధైర్యం పేరుకుంది...తన ఆరోగ్యం విషయంలో డాక్టరు యేం చెప్తాడో?... ఆమెగుండెలు పీచుపీచుమంటున్నయ్.

బాలకృష్ణ యింట్లోనే వున్నాడు... ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించాడు.

# చీకటి తెరలు

కొద్దిసేపు అదీ, యిదీ, మాట్లాడుకున్నాక డాక్టరు సుశీలని పరీక్ష చేశాడు. ఆశ్చర్యపోయాడు.

స్నేహితుణ్ణి కొంచెం చాటుగా తీసుకపోయి,

"నీ పెళ్ళయి సంవత్సరం దగ్గర కావస్తోంది కదూ?" అన్నాడు.

"ఔన్రా! యేం?" ఆత్రుతగా అడిగాడు ప్రసాదరావు.

"మరేం లేదులే...అధైర్యపడకు... స్నేహితుడవు కాబట్టి వున్నది వున్నట్టు చెప్పాల్సివచ్చింది. మీ ఆవిడకి క్షయ ప్రారంభదశలో వుందిరా" చెప్పలేక, విధిలేక చెప్పాడు బాలకృష్ణ.

ప్రసాదరావు నిల్చున్న పాటున నీరైపోయాడు. అతనికి లోకమంతా కారు చీకటిగా కన్పించింది. అప్పట్లో యెవరిమీదా కోపం ముంచుకురాలేదు—దురదృష్టంపై తప్ప. కొన్ని క్షణాలవరకూ యేం మాట్లాడాలో తెలీలేదతనికి. స్నేహితుని విన్నవదనం చూసి బాలకృష్ణ చిన్నగా నవ్వుతూ "మరేం భయంలేదు లేరా...త్వరలో మేలుకున్నావ్...మంచి మందులిస్తే మచ్చుకన్నా కన్పించకండా హరించిపోతుంది" ధైర్యం చెప్పాడు. కాని ప్రసాదరావుకి నమ్మకం కాలేదు.

"బాగవుతుందంటావురా?" అధైర్యపడుతూ అడిగాడు.

బాలకృష్ణ నవ్వాడు "ఇంత నమ్మకం లేకపోతే యెలారా? ప్రథమదశలో వుంది గాబట్టి తప్పక బాగవుతుంది...యీ పట్నంలో వుంచేకంటె గాలి మార్పుకోసం పల్లెకిపంపితే బావుంటుంది. మీ అత్తారిది యేదో పల్లెటూరన్నావు కదూ/ యిక్కడికి దగ్గరేనా?"

"ఆ! దగ్గరే...అయిదుమైళ్ళుంటుందిరా"

"మరింకేం...? అక్కడికి పంపేయ్... మనం వెళ్ళడానిక్కూడా వీలుంటుంది. మరోసారి హెచ్చరిస్తున్నాను... మరేం బెంగపెట్టుకోకు.. ఆ బాధతంతా నేను తీసుకుంటున్నాను" అన్నాడు బాలకృష్ణ ...యిద్దరూ సుశీలదగ్గరివచ్చారు.

ఇంతవరకూ సుశీల గుండెలు కొట్టుకుంటూనే వున్నయ్. డాక్టరు భర్తని చాటుగా పిల్చి రహస్యంగా చెపుతున్న విషయమేవిఁటో ఆమెకి అర్థం కాలేదు...ఏదో తనకి తెలిసినవిషయంగురించి ఆమె లోలోన కుమిలిపోతూ బాధపడుతోంది. వాళ్ళు, తిరిగి వచ్చాక సుశీల భర్త మొహంలోకి చూసింది. అతని మొహం వెలవెల బోతూవుంది...యింతవరకూ ప్రశాంతంగా, ప్రకాశవంతంగా వుండే భర్త మొహం ఇప్పుడు వివర్ణమవడంతో ఆమెకి మరింత బెంగపట్టుకుంది. కాని యేమీ మాట్లాడలేదు. కొద్దిసేపు పోయాక ప్రసాదరావు భార్యని తీసుకుని వెళ్ళిపోయాడు. త్రోవలో డాక్టరు యేం చెప్పాడని సుశీల రెండుమూడుసార్లు అడిగింది...కాని ప్రసాదరావు నిజం చెప్పడానికెందుకో జంకిపోయాడు. ఏవీఁలేదని ముభావంగా జవాబు చెప్తూ గడిపాడు.

* * *

ఇంటికిపోయేసరికి కారుచీకటి తారులా పరిసరాల్ని ఆక్రమించుకుంది. ప్రసాదరావు తాళంతీసి యింట్లోకిపోయి దీపం ముట్టించాడు. సుశీల బట్టలుమార్చుకుని వంటగదిలోకిపోతూ.

"అన్నం పెట్టేస్తానండీ" అంది.

"ఇప్పుడేవద్దు సుశీ" అన్నాడు ప్రసాదరావు ముక్తసరిగా...ఆ జవాబులో యేదో అవ్యక్తమయిన బాధ నిబిడీకృతమైనట్టు వూహించుకొంది సుశీల. ఇంతవరకూ యిల్లాంటి జవాబు భర్తనోట వినలేదు. భారంగా అడుగులు వేసుకుంటూ భర్తదగ్గర కొచ్చింది.

"అలావున్నారేవండీ?" అంది మెల్లగా.. అన్నదేగాని ఆమె గుండెలు జోరుగా కొట్టుకొంటున్నయ్...కాళ్ళు అప్రయత్నంగా వణుకుతున్నయ్.... ప్రసాదరావు మెదడులో సుళ్లు తిరుగుతున్నయ్ ఇంటికప్పువేపున్న దృష్టిని భార్య వేపు కేంద్రీకరించాడు...ఆమె వేపు పిచ్చిగా కాస్సేపు చూశాడు...ఆమెతో నిజం చెప్పాలా, వద్దా? అన్న సందిగ్ధంలో పడిపోయాడు. చెప్పేయాలి...లేకపోతే ఆమెకూడా నిజం తెలుసుకోలేక బాధపడుతుంది—తనకీ మనోవ్యధ తప్పదు.. చెప్పేస్తే కొంత వుపశమనం కలుగుతుందేమో ననుకున్నాడు.

"సుశీలా..." అతని గొంతు బొంగురుపోయింది.

"ఏవండీ...యేవిఁటో చెప్పండి" అంటూ అతనిముందు కూలబడింది. ఆమెకి భయం మరింత హెచ్చయింది. ఆయనయేం చెప్తారో ఆమె వూహించుకోగలిగింది.

"నీకు క్షయ వుందని డాక్టరు చెప్పాడు సుశీ" బాధపడుతూ అన్నాడు ప్రసాదరావు. సుశీల తలపై పిడుగుపడ్డట్టయింది...యింటిగోడలు కూలి మాదపడ్డట్టయ్యాయ్...నాన్న ఈయన్ని మోసం చేశారు...మొదట్నించీ తనకున్న జబ్బు విషయం యెందుకు చెప్పేయలేదు? ఆమె మెదడులో రైళ్ళు పరిగెడుతున్నయ్... ఢీకొంటున్నయ్...ఏం చెప్పాలో యేవిఁటో తెలీక మధనపడుతోంది. ఆమె మొహమంతా స్వేదబిందువులతో నిండి మసక దీపపు కాంతిలో మెరుస్తున్నయ్. ఆమె పెదాలు వణుకుతున్నయ్. కన్నీళ్ళు అప్రయత్నంగా చెమటబిందువులతో కలిసి చెక్కిళ్ళపై జారాడ్డం ప్రసాదరావు స్పష్టంగా చూశాడు.

"క్షమించండీ! మిమ్మల్ని మా నాన్న మోసం చేశాడు. నిజాన్ని కప్పిపుచ్చి నాటకమాడాడు.. యిందులో నా తప్పేం లేదండీ" అంటూ వలవల యేడ్చిందిసుశీల. భార్య పరిస్థితి, ఆవేదన చూసి ప్రసాదరావుకి జాలిపుట్టుకొచ్చింది. తనని మోసగించినందుకు కోపం యెందుకురాలేదో అతనికి తెలీలేదు . .అసలు కోపం యెందుకురావాలి? ఎవరిమీద? యిందులో భార్యతప్పేముంది...? మళ్ళీ సమాధాన వేడ్డాడు.

"అవుతే మీకు ఇంతకీ యీ విషయం మొదటే తెలుసునన్నమాట" అన్నాడు ప్రసాదరావు మొహం పక్కకి తిప్పుకుని.

"తెలుసునండీ; మా నాన్న యెన్నో మందులిప్పించారు.. కొంత నయమయిందని కూడా అన్నారు.. తన బాధ్యత తీర్చుకుందుకు పెళ్ళిచేసేశారు.. యిందులో నా తప్పేముందో ఆలోచించండి" అంది సుశీల కన్నీరు చీర చెరగుతో తుడుచుకుంటూ.

అనుకోకండా ప్రసాదరావుకి గతం జ్ఞాపకమొచ్చింది. తను పెళ్ళిచూపులకి వెళ్ళినప్పుడు సుశీలని చూశాడు. కాని ఆమెలో అంతర్గతంగా యేంజబ్బుందో తెలుసుకోలేకపోయాడు. ఆ ఛాయలే అతనికి కన్పించలేదు. అదంతా అతనికో కలలా కన్పిస్తున్నదిప్పుడు...వాస్తవ లోకంలో పడ్డాడు. యెదురుగా భార్యవున్నా ఆమెపై కోపంగాని, ఆవేశంగాని, కలగలేదు.

చెప్పుకోవాలంటే ప్రసాదరావు శాంతస్వరూపుడు. దూరం ఆలోచించే వ్యక్తి... యీ విషయంలో తప్పు నిర్ణయించాలంటే సుశీలతండ్రే బాధ్యుడిలా అగుపించాడతనికి ...మళ్ళీ అతనిలో పరివర్తన...యిదంతా భగవన్నిర్ణయం అనుకుని వేదాంతంలోకి దిగిపోయాడు. దాంతో మరింత శాంతం, సహనం, అతనిలో స్థిరపడ్డాయి. "ఇందులో తప్పెవరిదీ లేదు సుశీలా! యిదంతా నా దురదృష్టం...నీతో హాయిగా జీవననౌకను నడుపుదామనుకున్నాను. కాని యేదో చీకటి తెర అకస్మాత్తుగా అడ్డుపడింది. అదేవిఁటో నా జీవితంలో అడుగడునా అపశ్రుతులే!" ఆవేదనతో కృంగిపోయాడు భర్త ఆవేదన చూసి మరింత చలించిపోయింది సుశీల. భర్త తనను విడిచి పెడతాడన్న భయంగానీ, విచారంగానీ, ఆమెకు లేదు...తన విషయంలో బాధపడి కృంగిపోతాడేమోనని బెంగపట్టుకుంది.

"డాక్టరేమన్నాడండీ?" మొహం దించుకొని మెల్లగా అంది...ఆమె కళ్ళనుండి రెండు బిందువులు ప్రసాదరావు పాదాల్ని అభిషేకం చేశాయి.

ప్రసాదరావు కళ్ళు జలదరించింది. జరిగిందేదో జరిగిపోయింది. తను అనవసరంగా ఆమెకి బాధ కలిగిస్తున్నాను... అనుకొన్నాడు.

"ఫరవాలేదన్నాడులే సుశీ! యింకా ప్రారంభదశలో వుందట. తప్పక బాగయిపోతుందన్నాడు." తల నిమురుతూ బుజ్జగిస్తున్నట్టుగా అన్నాడు ప్రసాదరావు.

"పోనిండి.. నా కేలావున్నా నాకు విచారంలేదు... నేను చచ్చిపోయినా ఫరవాలేదు.. జరిగిందేదో జరిపోయింది. మీరు మాత్రం మనసులో బాధపడకండి..." అంది సుశీల రుద్ధకంఠంతో. భార్యమాటలు ప్రసాదరావుకి చైతన్యం కలిగించాయి.

"అదేమిటామాటలు సుశీలా? ఎందుకు చచ్చిపోతావ్.. ?డాక్టరు యేం భయం లేదని హామీయిస్తుంటే యింకేం? యిక్కడికంటె, పల్లెలో కొన్నాళ్ళు గడిపితే మంచిదంటున్నాడు డాక్టరు.. రేపే మీ వూరు ప్రయాణం కడితే బావుంటుంది. ప్రతి ఆదివారం మేంయిద్దరం అక్కడికి వస్తుంటాం" అన్నాడు ప్రసాదరావు గుండె ధైర్యం తెచ్చుకుని.

సుశీల హృదయం యిప్పుడు కొంచెం తేలికపడింది. భర్త అంత విశాలహృదయంతో హామీయిస్తున్నప్పుడు తనెందుకు బాధపడాలి? తన భర్తలాంటి వ్యక్తులు లోకంలో యెంతమందివుంటారు? ...అనుకుంది. జవాబేం చెప్పకండా మౌనంగా మొహం దించుకుని కూర్చుంది. ఇంకేమేమో మాట్లాడి, భార్యని కలతపర్చటం మంచిది కాదనుకొన్నాడు ప్రసాదరావు.

"యీ విషయంలో అట్టే మథనపడకు సుశీలా! నీకేం భయంలేదు కొన్నాళ్ళకి మళ్ళీ పువ్వులా తయారవుతావులే...వెళ్ళి వడ్డించు . భోంచేద్దాం." అంటూ ఆదరంతో ఆమె భుజాలు పట్టుకుని లేవదీశాడు. సుశీల లోలోన నవ్వుకుంది మెల్లగా అడుగులు వేసుకుంటూ వంటగదివేపు వెళ్ళింది.

## 3

మరుచటిరోజే ప్రసాదరావు భార్యని తీసుకొని అత్తవారింటికి వెళ్ళాడు. వీళ్ళు అకస్మాత్తుగా రావటం వాళ్ళకి ఆశ్చర్యం కలిగించింది. ప్రసాదరావు విషయమంతా మామతో చెప్పాడేగాని, తనకి జరిగిన మోసానికి వుద్రేకపడి తిట్టలేదు. ప్రసాదరావు మామ వెంకటేశ్వర్లు తన తప్పిదాన్ని తెలుసుకుని, పశ్చాత్తాపపడి అల్లుడిని క్షమాపణ వేడుకొన్నాడు. అతని మనసుకి తెలుసు, ప్రసాదవు కాకండా మరొకాడైతే తన కూతురిగతి యేమవుతుందో! అల్లుడిపై పూజ్యభావం యేర్పడింది...అతనికే కాదు ....యింట్లో అందరికీ. ప్రతివారం డాక్టరు, తనూ, వస్తుంటామని చెప్పి రెండు దినాలుండి వెళ్ళిపోయాడు ప్రసాదరావు.

వెంకటేశ్వర్లు మొదట్నించీ జరిగిందంతా తెలుసుకుని తననితానే తిట్టుకున్నాడు. అంతమంచివాణ్ణి మోసంచేశానని అతని బాధ...నిజానికి తన అల్లుడు లక్ష వ్యక్తుల్లో ఒకడు—అంత విశాలహృదయం, సహనం, యెవరికుంటుంది? అనుకున్నాడు.

ప్రతి ఆదివారం ప్రసాదరావు డాక్టర్ని తీసుకుని వెళ్తుండేవాడు పల్లెకి. బాలకృష్ణ శక్తివంచన లేకండా మందులు, యింజక్షన్లు యిస్తున్నాడు.. రాను రాను సుశీల ఆరోగ్యం పుంజుకోవటం తన కష్టం ఫలిస్తుంది కదా అని సంతృప్తిపడ్డాడు బాలకృష్ణ. ప్రసాదరావు యెంత ఆనందిస్తున్నాడో అతనికే తెలియాలి.

అప్పుడప్పుడు మాత్రం ప్రసాదరావు అంతులేని ఆలోచనలో పడిపోతాడు...తనలాంటి వ్యక్తుల జీవితంలోనే భగవంతుడెందుకో ఒడిదుడుకులు, తుపానులు కల్పిస్తాడు తనేం తప్పుచేశాడని? అతిఘోరమైన తప్పులుచేసే వాళ్ళందరికీ జీవితం హాయిగా నడుతుంది...తనేం తప్పులు చేయలేదనే గామోసు చీకటితెరలు నిర్మిస్తుంటాడు?.. అని; అయినా నిరాశమాత్రం అతని హృదిలో చొరనియకండా గుండె నిబ్బరంతో, ఆశతో ఆ చీకటి తెరలమధ్య జీవిస్తున్నాడు ప్రసాదరావు. ఎప్పుడో ఒకప్పుడు ఆ తెరలు విచ్ఛిన్నం కాక మానవని అతని మనోనిబ్బరం.. ★


ఆంధ్రపత్రిక

మన్మథ ఉగాది సంచిక

ప్రముఖ కళాకారుల కథలతో, నాటికలతో కావ్యఖండికలతో, వ్యాసములతో అనేక త్రివర్ణ చిత్రములతో, రేఖాచిత్రములతో సర్వాంగసుందరంగా ఉగాదినాటికి (మార్చి 25) వెలువడుతుంది

ముఖచిత్రం: రతిమన్మథులు

మీ సమీపమునగల ఆంధ్రపత్రిక ఏజంటువద్దగాని మాకు వ్రాసిగాని మీ ప్రతిని వెంటనే రిజర్వు చేయించుకోండి

మన్మథ సంవత్సర పంచాంగము సహా

వెల రు 2-0-0 మాత్రమే

* పోస్టుద్వారా పంపుటకు ప్రతి 1 కి ప్యాకింగ్ పోస్టేజి అ 15/లు అదనము

మేనేజరు, ఆంధ్రపత్రిక.